సాక్షి ఆదిలాబాద్

ఆదివారం | 14 | సెప్టెంబర్ | 2025



దాడికి నిరసనగా విధుల బహిష్కరణ

బోథ్ సీహెచ్‌సీలో వైద్య సిబ్బందిపై ఓ యువకుడు దాడికి యత్నించాడు. ఈమేరకు వైద్యులు, సిబ్బంది విధులు బహిష్కరించారు. దీంతో ఓపీ సేవలు నిలిచిపోయాయి. 8లో▸



బాసర అభివృద్ధిపై దృష్టి

బాసర అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్‌రావు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం తగ్గనుంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన 'కంది'



సీఎంను సన్మానిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు కంది తెలిపారు. సీసీఐతో పాటు స్థానిక అంశాలపై వినతిపత్రాలు సమర్పించగా, సానుకూలంగా స్పందించిన సీఎం త్వరలో ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వస్తానని హామీ ఇచ్చినట్లుగా పేర్కొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన పీపీలు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ పీపీల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేసినట్లు పీపీ రమణరెడ్డి తెలిపారు. జీవో నంబర్ 12ను రద్దు చేయాలని, గౌరవ వేతనం పెంచాలని , పీపీలను హోంనుంచి తొలగించి న్యాయశాఖ ద్వారా కార్యకలాపాలు నిర్వహించేలా చూడాలని కోరారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లుగా పేర్కొన్నారు. ఇందులో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సంజయ్ వైరాగ్రే, బి.ప్రవీణ్, మధుకర్, జగన్‌మోహన్‌రావు ఉన్నారు.

నేడు లైసెన్స్‌డ్ సర్వేయర్ సప్లిమెంటరీ పరీక్ష

కైలాస్‌నగర్: లైసెన్స్‌డ్ సర్వేయర్ల సప్లిమెంటరీ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గతంలో నిర్వహించిన పరీక్షలో ఫెయిలైన 109 మంది థియరీ, ప్లాటింగ్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు థియరీ పరీక్ష ఉంటుంది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్లాటింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థులను అరగంట ముందు నుంచే కేంద్రంలోకి అనుమతించనున్నట్లు కోఆర్డినేటర్ రాజేందర్, అబ్జర్వర్ కె.రాజలింగు తెలిపారు. ఏర్పాట్లను కళాశాల ప్రిన్సిపాల్ అతీక్‌బేగంతో కలిసి శనివారం పరిశీలించారు.

ఆరోగ్యంగా ఉంటేనే శిక్షణలో రాణింపు



కేడెట్లకు శిక్షణ కల్పిస్తున్న వైద్యులు

ఆదిలాబాద్: ఎన్‌సీసీ కేడెట్లు ఆరోగ్యంగా ఉంటేనే శిక్షణలో రాణించడం సాధ్యపడుతుందని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వీపీ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీటీసీలో కొనసాగుతున్న ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం నాలుగో రోజుకు చేరుకుంది. కేడెట్లకు ఆరోగ్యం, పరిశుభ్రతపై వైద్యులతో శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రషీద్ అన్సారీ, వైద్యులు సంతోష్ ఆదిత్య, ఆమీ, తేజస్విని ఆరోగ్యం, ఎన్‌సీసీ అధికారులు అశోక్, రజిత, లక్ష్మణ్, భూమన్న, మధురావ్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలి



క్రీడాకారులతో రామేశ్వర్, నిర్వాహకులు

ఆదిలాబాద్: జోనల్ స్థాయి పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచాలని ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆడే రామేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం నిర్వహించిన జోనల్‌స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. అండర్–14, 17 విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల వేదిక ఇంకా ఖరారు కాలేదని, అయినప్పటికీ క్రీడాకారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ పూల్ నిర్వాహకులు రాష్ట్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇక చరిత్రకు సాక్ష్యమేనా..!



శిథిలావస్థకు చేరిన కలెక్టరేట్ భవనం

ఈ భవనం నుంచే 57 మంది పాలన



కలెక్టర్ల జాబితా

కలెక్టరేట్ భవనానికి పాలనాపరంగా విశిష్ట చరిత్ర ఉంది. 1941లో నిర్మించిన ఈ భవనంలో ఇప్పటి వరకు 57మంది కలెక్టర్లు పాలన సాగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు 49 మంది ఈ భవనంలోని చాంబర్ నుంచే సేవలందించారు. తెలంగాణ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రస్తుత కలెక్టర్ రాజర్షి షాతో కలిపి తొమ్మిది మంది పాలన వ్యవహారాలు నిర్వహించారు. కార్యాలయం మార్చాలని భావిస్తున్న తరుణంలో ఈ భవనం ఇక చరిత్రపుటల్లో నిలిచిపోనుంది.

- కలెక్టరేట్ మరో చోటకు తరలింపు?
- ఆర్డీవో, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాలు కూడా..
- భవనాల వెతుకులాటలో అధికారులు
- రేపటి వరకు స్పష్టత వచ్చే అవకాశం

కైలాస్‌నగర్: నిజాం హయాంలో నిర్మించి సుమారు ఏడున్నర దశాబ్దాల పాటు జిల్లా పాలనకు వేదికైన కలెక్టరేట్ భవనం ఇక చరిత్రకు సాక్ష్యంగా నిలిచిపోనున్నట్లు తెలుస్తోంది. శిథిలావస్థకు చేరిన ఈ భవనంలోని ఏ సెక్షన్ బ్లాక్ బాల్కనీ గురువారం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులతో పాటు ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. భవనాన్ని ఆర్‌అండ్‌బీ శాఖ సీఈ రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కార్యాలయ ముందరి భాగం పటిష్టంగానే ఉన్నట్లుగా భావించినా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో తరలించడమే ఉత్తమమని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఇంజినీరింగ్ అధికారుల బృందం సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేసిన నేపథ్యంలో జిల్లా పాలనాధికారి కూడా తరలింపే ఉత్తమమని భావిస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాలతో కలెక్టరేట్‌లోని ఆయా విభాగాల అధికారులు నిర్వహణకు అనువైన భవనాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. శనివారం కొన్నింటిని పరిశీలించి ఫైనల్ కూడా చేశారు. అయితే కలెక్టరేట్ తరలింపుపై మాత్రం రేపటి వరకు స్పష్టత వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

పెన్‌గంగ భవన్‌కు కలెక్టరేట్..?



జిల్లా పాలనకు కేంద్రబిందువైన కలెక్టరేట్‌ను తాత్కాలికంగా పక్కనే ఉన్న ఇరిగేషన్ శాఖకు సంబంధించిన పెన్‌గంగ భవన్‌కు మార్చాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. అధునాతన వసతులతో కూడిన ఈ భవనం ఇటీవలే నిర్మించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ చాంబర్లతో పాటు అన్ని సెక్షన్ల నిర్వహణకు అనుకూలంగా ఉండనున్నట్లుగా భావిస్తున్నారు. పైగా ప్రస్తుత కలెక్టరేట్‌కు ఆనుకునే ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు సైతం అందుబాటులో ఉండనుంది. కలెక్టర్ నిర్ణయం మేరకు కార్యాలయ తరలింపు సోమవారం వరకు స్పష్టతవచ్చే అవకాశముంది.

కలెక్టరేట్ మార్గాల మళ్లింపు..

కలెక్టరేట్‌లో కూలిన శిథిలాల తొలగింపు పూర్తి కానందున ప్రజల భద్రత దృష్ట్యా ప్ర వేశ, బయటికి వెళ్లే మార్గాలను మార్చినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. అధికారిక కార్యక్రమాల కోసం సీపీవో, డీసీవో కార్యాలయం, కలెక్టర్ సమావేశ మందిరం, ఎస్‌బీఐ వైపు నుంచి ట్రెజరీ కార్యాలయానికి ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. వెనుక వైపు నుంచి ఉన్న ర్యాంపు ద్వారా డీపీఆర్వో కార్యాలయం, ఆధార్ కేంద్రానికి అనుమతించనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజలు పోర్టికో/మెయిన్ డోర్ ద్వారా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

భవనాల వెతుకులాట...

- ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని జెడ్పీలోకి మార్చనున్నారు. తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ శనివారం సెలవు రోజైనప్పటికీ సిబ్బందితో కలిసి గదులను పరిశీలించి ఒకే చేశారు. త్వరలోనే కార్యాలయాన్ని అక్కడికి షిఫ్ట్ చేయనున్నారు.
- ఆర్డీవో కార్యాలయం కోసం ఆర్డీవో స్రవంతి కార్యాలయ ఉద్యోగులతో కలిసి జెడ్పీతో పాటు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గల డిప్యూటీ ఈవో కార్యాలయాన్ని పరిశీలించారు. డిప్యూటీ ఈవో కార్యాలయం అనుకూలంగా ఉండనుందనే భావనకు వచ్చారు.
- ఇక పౌరసరఫరాలశాఖ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, ట్రెజరీ, సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయాలు ప్రస్తుత కలెక్టరేట్ భవనంలోనే కొనసాగుతున్నాయి. అయితే ట్రెజరీ, డీపీఆర్వో కార్యాలయాలు ఉన్న భవనాలపై అంతస్తు పటిష్టంగానే ఉన్నట్లుగా ఆర్‌అండ్‌బీ అధికారులు సూచించారు. వీటిని మినహాయిస్తే మిగతా కార్యాలయాలన్నీ కలెక్టరేట్ భవనం నుంచి ఇతర చోటుకు తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లుగా సమాచారం.



జిల్లా పరిషత్‌లో గదులను పరిశీలిస్తున్న ఆర్డీవో స్రవంతి, ఉద్యోగులు

- డీసీఎస్‌వో కార్యాలయాన్ని కలెక్టరేట్ ఆవరణలోని సీపీవో కార్యాలయంలోకి మార్చేందుకు యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఈ కార్యాలయం పాలనాపరంగా అదనపు కలెక్టర్ చాంబర్‌ను ఆనుకుని ఉండాలనే నిబంధనతో ఈ కార్యాలయాన్ని సీపీవో ఆఫీసులోకి మారుస్తారా లేదా అనే దానిపై సోమవారం స్పష్టత రానుంది.
- సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సైతం భవన వేటలో నిమగ్నమయ్యారు. మొత్తానికి కలెక్టరేట్‌తో పాటు అందులోని కార్యాలయాలన్నీ ఇతర భవనాల్లోకి మారడం ఖాయంగా కన్పిస్తుండగా ఇందుకు వారం రోజుల సమయం పట్టనున్నట్లుగా అధికారులు అభిప్రాయపడుతున్నారు. అప్పటి వరకు ఆయా కార్యాలయాల పాలన వ్యవహారాల్లో అంతరాయం కలగక తప్పదని చెబుతున్నారు.

బదిలీలకు వేళాయె

- ఎక్సైజ్, వాణిజ్య, రిజిస్ట్రేషన్ శాఖల్లో..
- ప్రభుత్వం నుంచి జీవో జారీ
- సుదీర్ఘకాలం ఒకే చోట ఉన్నవారికి స్థానచలనం



ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షి, ఆదిలాబాద్: ప్రభుత్వానికి ఆదాయాన్నిచ్చే శాఖల్లో బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందుకు సంబంధించి ఆయా శాఖల్లో విధి విధానాలు రూపొందిస్తున్నారు. త్వరలో జారీ చేయనున్నట్లు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ల శాఖల్లో బదిలీలకు రంగం సిద్ధమవుతుంది. ఒకే చోట సుదీర్ఘకాలం పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పించనున్నారు. సాధారణ బదిలీల సమయంలో అప్పట్లో అన్ని శాఖల్లో బదిలీలు చోటు చేసుకున్నాయి. అయితే సర్కారుకు ఆదాయాన్నిచ్చే ఈమూడు శాఖలను మినహాయించారు. తాజాగా ప్రత్యేక ఉత్తర్వు ద్వారా వీరి బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఆయా శాఖల్లో ఇలా..

ఎక్సైజ్ శాఖలో సుదీర్ఘకాలం ఒకే చోట పనిచేస్తున్న ఎస్సైలకు సంబంధించిన జాబితా తయారు చేయాలని ఆ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి మౌఖికంగా ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో రెండేళ్లకు పైబడి ఒకే చోట పనిచేస్తున్న వారి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. అలాగే కానిస్టేబుళ్లకు సంబంధించి కూడా విధి విధానాలు రూపొందిస్తున్నట్లు చెబుతున్నారు. వీరితో పాటు ఉన్నతాధికారుల బదిలీలు కూడా ఉంటాయనే ప్రచారం సాగుతోంది. ఇక రిజిస్ట్రేషన్ శాఖలో సబ్ రిజిస్ట్రార్లతో పాటు ఉద్యోగుల బదిలీలు సైతం ఉండనున్నాయి. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న సబ్‌రిజిస్ట్రార్ పోస్టుల్లో ఇతర ప్రాంతాల నుంచి అధికారులు ఇక్కడకు వస్తారా లేదా అనేది చూడాల్సిందే. ఇక వాణిజ్యపన్నుల శాఖలోనూ బదిలీలకు రంగం సిద్ధమవుతుంది. ఈ విషయంలో రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌చార్జి డీఆర్ ప్రసన్నను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు వెలువడినప్పటికీ శాఖాపరంగా రావాల్సి ఉందని, ఆ తర్వాతే ఏయే క్యాడర్ ఉద్యోగుల బదిలీలు ఉంటాయనేది స్పష్టత వస్తుందని పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంపై కొరడా

- నార్నూర్ కేజీబీవీ ఎస్‌వోపై వేటు.. ఉద్యోగం నుంచి తొలగింపు
- ఇద్దరు సిబ్బందికి పది రోజుల వేతనం కోత

ఆదిలాబాద్‌టౌన్: విధుల్లో నిర్లక్ష్యం వహించిన నార్నూర్ కేజీబీవీ ఉద్యోగులపై కలెక్టర్ రాజర్షి షా కొరడా ఝుళిపించారు. ఇటీవల నార్నూర్ మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు అందించిన భోజనంలో పురుగులు వచ్చాయి. దీంతో వారంతా ఆందోళనకు దిగారు. వెంటనే స్పందించిన కలెక్టర్ విచారణ కోసం ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌ను ఆదేశించారు. దీంతో ఆయన కేజీబీవీని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాల అపరిశుభ్రత, వంట సరుకులు నాసిరకంగా ఉండటం, స్టాక్ రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వంటి విషయాలు వెలుగులోకి వచ్చాయి. నివేదికను ఆయన కలెక్టర్‌కు అందజేశారు. దాని ఆధారంగా కలెక్టర్ ఆదేశాల మేరకు కేజీబీవీ ఎస్‌వో హిమబిందును ఉద్యోగం నుంచి తొలగించారు. అలాగే అకౌంటెంట్‌గా పనిచేస్తున్న తిరుమల, హెడ్ కుక్ కళాబాయిలకు సంబంధించి పది రోజుల వేతనాన్ని కోత విధించారు. 2025, 2026 విద్యాసంవత్సరంలో వీరికి ఇచ్చే రెన్యూవల్ పాయింట్లలో 15 శాతం తగ్గించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. కేజీబీవీలో స్టాండర్డ్‌ఆపరేటింగ్‌ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ని ఖచ్చితంగా అమలు చేయకపోతే ఉద్యోగుల రెన్యూవల్ నిలిపివేస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీలపై పట్టింపు కరువు

- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణకుమారి



మాట్లాడుతున్న కరుణకుమారి

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణకుమారి అన్నారు. ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా నాలుగో మహాసభలను పట్టణంలోని యాదవ సంఘ భవనంలో శనివారం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలు, సాధించుకున్న హక్కులు, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి అహర్నిశలు పనిచేస్తున్న అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం సరి కాదన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గంతో కేసుల సత్వర పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకరరావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

ఆదిలాబాద్‌టౌన్: రాజీ మార్గం ద్వారానే కేసుల సత్వర పరిష్కారం సాధ్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకరరావు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారానికి అవకాశముందన్నారు. సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. రాజీ పడే కేసులను, సంబంధిత సంస్థలు, వ్యక్తులతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అనంతరం పలు కేసులను అప్పటికప్పుడు పరిష్కరిస్తూ తీర్పు ప్రతులను ఇరు పక్షాలకు అందజేశారు. ఇందులో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మి, జడ్జిలు కుమార్ వివేక్, శివరాం ప్రసాద్, హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేశ్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, పీపీలు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌లో..

బోథ్: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజీమార్గమే రాజ మార్గమని అన్నారు. అనంతరం నూతన కోర్టు భవనాన్ని పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కె.సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 34 క్రిమినల్ కేసులు, ఒక సివిల్ తగాదా, నేరం ఒప్పుకోవడం ద్వారా 22, ఎక్సైజ్ కేసులు 60, క్రిమినల్, ఎస్టీసీ కేసులు 429 పరిష్కారమైనట్లు తెలిపారు. అలాగే ఇచ్చోడ, బోథ్ ఎస్బీఐలకు సంబంధించి 32 కేసులు పరిష్కరించడంతో పాటు రూ.46 లక్షలు రికవరీ అయినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీపీ శ్రీధర్, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్స్ హరీశ్, గంగసాగర్, న్యాయవాదులు అంగద్ కేంద్రే, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

జిల్లాలో 15,357 కేసులు పరిష్కారం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ ద్వారా 15,357 కేసులు పరిష్కారమయ్యాయి. అలాగే రాష్ట్రస్థాయిలో జిల్లాకు 20వ స్థానం లభించింది. పరిష్కారమైన వాటిలో 18 సివిల్, 3,480 క్రిమినల్, 11,759 ప్రిలిటిగేషన్ కేసులున్నట్లు అధికారులు వెల్లడించారు.

గొర్రెల సహకార సంఘం ఎన్నికపై ఉత్కంఠ

కైలాస్‌నగర్: జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం పాలకవర్గ ఎన్నిక ఉత్కంఠగా మారింది. అధ్యక్ష పీఠం కోసం ఇద్దరు పోటీ పడుతున్నారు. వారికి రాజకీయ పక్షాలు మద్దతు తెలుపుతుండటంతో ఈ ఎన్నికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. జిల్లా సహకార అధికారి, ఎన్నికల అధికారి బి.మోహన్ ఈ నెల 10న నోటిఫికేషన్ జారీ చేశారు. 12న నామినేషన్లు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వంద మంది సభ్యులు కలిగిన ఈ సహకార సంఘానికి 32 నామినేషన్లు దాఖలయ్యాయి. నిర్ణీత సమయానికి 20 మంది ఉపసంహరించుకోగా 12 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా అధికారులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వేచి చూశారు. డైరెక్టర్లు ఎవరు హాజరుకాలేదు. కోరం లేని కారణంగా ఎన్నికను ఆదివారానికి వాయిదా వేస్తున్నట్లు డీసీవో ప్రకటించారు. అయితే 12 మంది డైరెక్టర్లు రెండు వర్గాలుగా విడిపోయారు. ఆరుగురు చొప్పున ఆశావహులు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. అయితే ఆదివా రం ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంతమంది హాజరైనా వారి నుంచి ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకోవడం జరుగుతుందని, మరోసారి వాయిదా ఉండదని డీసీవో తెలిపారు. అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తికి గౌరవ వేతనం అందనుంది. అలాగే సంఘానికి సంబంధించిన నిధులను పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌తో సంయుక్తంగా చెక్‌పవర్ వినియోగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లాకు 974 మెట్రిక్ టన్నుల యూరియా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో రైతుల యూరియా ఇక్కట్లపై ప్రభుత్వం స్పందించింది. 974 మెట్రిక్ టన్నుల ఎరువును రైలు ద్వారా జిల్లాకు పంపించింది. వీటిని లారీల్లో జిల్లాలోని ఆయా పీఏసీఎస్‌లు, అగ్రోస్, ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాలకు సరఫరా చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ స్వామి తెలిపారు. పీఏసీఎస్‌లు, అగ్రోస్ ఏజెన్సీలకు 420 మె.టన్నులు, ప్రైవేట్ షాపులకు 330 మె.టన్నులు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. మిగతా 224మెట్రిక్ టన్నులు గోదాంలో నిల్వఉంచినట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరిపడా ఎరువు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

నమ్మకమైన మోసాలు!

- తాకట్టు బంగారంతో కనికట్టు
- బ్యాంకుల్లోనే చేతివాటం..
- ఉమ్మడి జిల్లాలో వెలుగులోకి కొత్త నేరాలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పుత్తడి ధర రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో మోసాలు సైతం అదే తీరుగా పెరుగుతున్నాయి. ఇటీవల ఉమ్మడి జిల్లాలో వెలుగులోకి వచ్చిన మోసాలతో సర్వత్రా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరమేర్పడింది. ఎంతో నమ్మకంగా వ్యవహరిస్తున్న బ్యాంకుల్లోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. కొందరు బ్యాంకు ఉద్యోగుల తీరుతో ఆయా సంస్థల పనితీరుపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో బంగారంపై రుణాలు పొందాలన్నా, రుణ సంస్థలపై ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బంగారంతో పాటు విలువైన ఆస్తులు, బ్యాంకుల్లో తనఖా పెట్టేముందు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. కొన్నిచోట్ల మోసం ఆదిలోనే బయటపడుతుండగా మరికొన్ని చోట్ల నెలల తరబడి జరుగుతోంది.

నమ్మకమున్న చోటనే..

ప్రజల్లో బ్యాంకులపై నమ్మకానికి మారుపేరుగా విశ్వాసం ఉంది. అయితే కొంతమంది సిబ్బంది తప్పటడుగులతో అపవాదు మూటగట్టుకోవాల్సి వస్తుంది. సాధారణంగా బ్యాంకులు, ప్రైవేటు రుణసంస్థల్లో నిబంధనలు కఠినంగా ఉంటాయి. నగదు, బంగారం వంటి లావాదేవీల్లో క్షుణ్ణంగా పరిశీలనలు, తనిఖీలు ఉంటాయి. ప్రతీ విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు. ప్రతీస్థాయిలో జవాబుదారీతనం, పారదర్శకత ఉంటుంది. అంతేకాక కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నత స్థాయి అధికారులపై పర్యవేక్షణ ఉంటుంది. లావాదేవీల విషయంలో ప్రతీది అత్యంత భద్రత మధ్య సాగుతుంటాయి. అయితే అలాంటి నమ్మకున్న చోటనే ఇలాంటి మోసాలు వెలుగులోకి రావడం ఒకింత ఆశ్చర్యం కలిగిస్తోంది.

అప్రమత్తమైన బ్యాంకులు, సంస్థలు

చెన్నూర్ ఎస్‌బీఐ బ్రాంచి–2 వ్యవహారంతో బ్యాంకర్లు, రుణసంస్థలు అప్రమత్తమై తమ సంస్థల్లోని అన్ని బ్రాంచీల్లో బంగారం నిల్వలు, రుణాల లెక్కలు తీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సాధారణ ఆడిట్‌లతో పాటు ఈ ఘటనల తర్వాత ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు ఖాతా దారులు సైతం కుదవపెట్టిన బంగారం, రుణాలపై ఆరా తీస్తున్నారు. ఎక్కడికక్కడ రుణాలపై క్షుణ్ణంగా పరిశీలనలు చేస్తూ తమసంస్థల పరిధిలో ఉన్న సిబ్బందిపైనా కఠిన పర్యవేక్షణ ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించారు.

ఇటీవల జరిగిన ఘటనలు

- నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) ఎస్‌బీఐలో గోల్డ్ అప్రైజల్‌గా పని చేస్తున్న వ్యక్తి తనకు తెలిసిన 12 మంది పేరుతో నాణ్యత లేని బంగారాన్ని తనఖా పెట్టించి పనిచేస్తున్న బ్యాంకునే మోసం చేశారు. బ్యాంకులో మొత్తం రూ.20 లక్షలకు పైగా రుణాలకు అవకతవకలకు పాల్పడ్డారు. ఆడిట్‌లో ఈ మోసం బయటపడడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.
- చెన్నూర్ ఎస్‌బీఐ 2 బ్రాంచిలో పనిచేస్తున్న క్యాషియర్ బ్యాంకులో ఖాతాదారులు కుదవపెట్టిన 20 కిలోల బంగారాన్ని తనకు తెలిసిన వారికి ఇచ్చి ప్రైవేటు రుణసంస్థల్లో పెట్టించి అక్రమంగా రుణాలు పొందాడు. కేసు విచారణలో పోలీసులు రూ.1.10 కోట్ల నగదుతో పాటు 20 కిలోల బంగారం రికవరీని ప్రారంభించారు. దీంతో బ్యాంకులో కుదవ పెట్టిన ఖాతాదారుల బంగారంతో పాటు పలు ప్రైవేటు రుణ సంస్థలు చిక్కుల్లో పడ్డాయి.

క్లుప్తంగా

ముగ్గురు దేశీదారు విక్రేతల అరెస్ట్



దేశీదారుతో ఎక్సైజ్ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్/తాంసి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారును తీసుకువచ్చి ఆయా గ్రామాల్లో విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. రూ.10 వేల విలువ గల 195 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో ఈమేరకు వివరాలు వెల్లడించారు. పట్టుబడిన వారిలో తాంసి మండలం కప్పర్లకు చెందిన కొత్తూరి అఖిల్, దర్శనాల అభిలాష్, ఆదిలాబాద్‌లోని ఖుర్షిద్‌నగర్‌కు చెందిన అకంవార్ భజరంగ్ ఉన్నట్లు వివరించారు. బైక్‌పై మద్యాన్ని రవాణా చేస్తూ పట్టుబడ్డారని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు. ఏ విభాగం అంతస్తు కుప్పకూలిన కలెక్టరేట్ భవనాన్ని అనుమతులు లేకుండా బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం హెల్మెట్లు ధరించి నిరసన వ్యక్తం చేసినట్లుగా పేర్కొన్నారు. ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాన్ని నిషేధిత ప్రాంతంగా అధికారులు ప్రకటించారన్నారు. అక్కడకు వెళ్లొద్దని చెప్పినప్పటికి బీఆర్‌ఎస్ నాయకులు ఫైజల్ సాజిద్ ఉద్దీన్, యూనుస్ అక్బానీ, మెట్టు ప్రహ్లాద్, జి.రమేశ్, మారిశెట్టి గోవర్ధన్, అడప తిరుపతి, రాజన్నతోపాటు మరికొందరు వెళ్లి నిబంధనలు ఉల్లంఘించారన్నారు. దీంతో వారందరిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

హీరాపూర్‌లో ఇంట్లో చోరీ

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మేజర్ పంచాయతీ పరిధి హీరాపూర్ గ్రామానికి చెందిన షేక్ యాసార్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఎస్సై ఇ.సాయన్న కథనం ప్ర కా రం.. షేక్ యాసార్ ఈనెల 9న కుటుంబ స భ్యులతో కలిసి జైనూర్ మండలంలోని తమ బంధువుల వద్దకు వెళ్లారు. అదేరోజు సాయంత్రం తిరిగివచ్చి చూసేసరికి ఇంట్లో రూ.10 వే ల నగదును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని గుర్తించారు. షేక్ యాసార్ ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖానాపూర్ బస్టాండ్‌లో..

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. విద్యానగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి.. నిర్మల్ నుంచి ఖానాపూర్‌కు మంచిర్యాల బస్సు దిగే క్రమంలో హ్యాండ్ బ్యాగులో పర్సును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. రూ.3 వేల నగదు, ఏటీఎం, ఆధార్, పాన్‌కార్డులు ఉన్నాయి. బాధితురాలు కంట్రోలర్ పోశెట్టికి తెలపగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చేరుకుని బస్సును తనిఖీ చేశారు.

పాటలీపుత్ర వీక్లీ సూపర్‌ఫాస్ట్ రైలు పొడిగింపు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో నిలిచే 22352/51 ఎస్.ఎం.వీ.టి. బెంగళూరు నుంచి పాటలీపుత్ర వీక్లీ సూపర్‌ఫాస్ట్ రైలును సహర్స జంక్షన్ వరకు పొడిగించినట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలు పాటలీపుత్ర నుంచి హాజీపూర్, బరుని, ఖగరియా, మాన్సీ మీదుగా సహర్స జంక్షన్ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. వచ్చే వారం నుంచి అమలులోకి రానున్నట్లు తెలిపారు.

బాసర అభివృద్ధిపై దృష్టి

- రూపొందుతున్న మాస్టర్ ప్లాన్
- సీఎం ఆమోదం తర్వాత పనులు



బాసర సరస్వతీ ఆలయం

భైంసా: దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధ క్షేత్రమైన బాసర అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించింది. రాష్ట్రవ్యాప్తంగా బాసర, భద్రాచలం, జోగులాంబ, కాళేశ్వరంతో కలిపి పది క్షేత్రాలకు రూ.2,202.30 కోట్ల అంచనాలతో దేవాదాయ శాఖ మాస్టర్ ప్లాన్ రూపొందించింది. మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్‌రావు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం కోసం పంపించారు. ఆ తర్వాత బాసరలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

నాలుగు దశల్లో అభివృద్ధి..

బాసరలో జూలై 12న మంత్రి కొండా సురేఖ పర్యటించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అనుగుణంగా నాలుగు దశల్లో అభివృద్ధి చేపట్టనున్నారు. ఇందుకు రూ.180.10 కోట్లతో డీపీఆర్(డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) సిద్ధం చేస్తున్నారు. సీఎం ఆమోదం తర్వాత అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. ఈనెల 10న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బాసర అమ్మవారి దర్శనం అనంతరం మాట్లాడారు. రూ.190 కోట్లతో ఆలయ మాస్టర్ ప్లాన్ అమలు చేయనున్నట్లు వెల్లడించారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలు విజయవంతంగా నిర్వహించేలా అన్ని శాఖలతో సమన్వయం చేశామని తెలిపారు. బాసర ఆలయ అభివృద్ధిపై తాను పర్యవేక్షణ చేస్తున్నానని పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖతో చర్చించి బాసర అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఏడాదిలోగా జాతీయ రహదారి నిర్మాణం పూర్తి!

అక్షరాభ్యాస క్షేత్రం కావడంతో బాసర సరస్వతీ ఆలయానికి భక్తుల సంఖ్య పెరుగుతోంది. హైదరాబాద్ నుంచి నర్సాపూర్, బాన్సువాడ, బోధన్‌ను కలుపుతూ బాసర, భైంసా వరకు 161 బీబీ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుంది. ఏడాదిలోగా పూర్తి స్థాయిలో నిర్మాణం కానుంది. కామారెడ్డి మీదుగా ఒక జాతీయ రహదారి బోధన్ మీదుగా మరో జాతీయ రహదారి మహారాష్ట్రలోని నాందేడ్, ధర్మాబాద్ మీదుగా ఇంకో రహదారి బాసరను కలుపుతున్నాయి. మూడు జాతీయ రహదారులు, రైల్వేస్టేషన్ ఉండడంతో రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడంతో ఉచిత ప్రయాణాలు బాగానే పెరిగాయి. బాసరకు అను నిత్యం అధిక సంఖ్యలోనే భక్తులు వస్తున్నారు.

నిధులు విడుదల చేయాలి

బాసరలో పుష్కరాల నేపథ్యంలో చేపట్టబోయే పనులపై ఇప్పటికే కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా అధికారులు దృష్టిసారించారు. ప్రభుత్వం నిధులు త్వరగా విడుదల చేసి పనులు ప్రారంభించి బాసర వచ్చే భక్తుల ఇక్కట్లు తీరుతాయి. ఈ ప్రాంత ప్రజలంతా బాసర అభివృద్ధి కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు.

బతుకు 'గీసిన' చిత్రం



బొమ్మలు గీస్తున్న పోచయ్య



పోచయ్య గీసిన చిన్నారుల బొమ్మ

కూటి కోసం తను నమ్ముకున్న కళనే కడుపు నింపేలా చేసింది అంటున్నాడు చిత్రకారుడు పోచయ్య. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కొత్తపేటకు చెందిన ఈయన పెన్సిల్ స్కెచ్‌తో బొమ్మలు గీస్తుంటాడు. తెలుగు రాష్ట్రాల్లో తన కళా నైపుణ్యంతో పెన్సిల్ స్కెచ్ ద్వారా బొమ్మలు గీస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నాడు. ఎవరైన వ్యక్తి ఎదురుగా ఉంటే అచ్చు గీసినట్లు బొమ్మ గీయడం ఈయన ప్రత్యేకత. వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

13 మంది గిరిజనుల అరెస్టు



మీడియాతో తమగోడు వెల్లబోసుకుంటున్న గిరిజనులు



గిరిజన మహిళలను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ అటవీబీట్ 380కంపార్టుమెంటులో గిరిజనుల ఆక్రమిత ప్రదేశంలో శనివారం వందల సంఖ్యలో అటవీ అధికారులు, సిబ్బంది, పోలీసులను మోహరించారు. శుక్రవారం అటవీశాఖ సిబ్బందిపై జరిగిన దాడి నేపథ్యంలోనే భారీగా తరలివచ్చారు. అటవీశాఖ అధికారులు గోప్యంగా వ్యవహరించడం, మీడియా, ఆదివాసీ సంఘాల నాయకులను లోపలికి అనుమతించకపోవడంతో అనుమానాలు తలెత్తాయి. అటవీ అధికారులతో ఆదివాసీ సంఘాల నాయకులు, మీడియాకు కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. దీంతో అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. కొద్ది గంటల తర్వాత అటవీ ఆక్రమిత భూమిలో తాత్కాలిక గుడిసెల్లో నివాసం ఉంటున్న 12మంది మహిళలు, ఒక పురుషుడిని పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. విధుల్లో ఉన్న సిబ్బందిపై కారం చల్లి దాడి చేసినందుకు అటవీ అధికారుల ఫిర్యాదు మేరకు అరెస్టు చేసినట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. కాగా, గిరిజనులు ఆక్రమించి పంట సాగుకు ప్రయత్నించిన భూమిలో అటవీ అధికారులు జేసీబీలతో గోతులు తీశారు.

దాడిపై తలోమాటా..!

అటవీశాఖ సిబ్బందిపై దాడిపై గిరిజనులు, అటవీ శాఖ అధికారులు తలోమాటా చెబుతున్నారు. తాము వాగులో స్నానాలు చేస్తుండడం చూడడంతో దాడి చేశామని గిరిజన మహిళలు పేర్కొన్నారు. ఈ విషయమై జన్నారం ఎఫ్‌డీవో రామ్మోహన్‌ను సంప్రదించగా.. గిరిజనులు ఆక్రమిత స్థలాన్ని ఖాళీ చేయడం లేదని, విధుల్లో భాగంగా సిబ్బంది పహారా కాస్తుండగా దాడి చేశారని తెలిపారు. మీడియాను అనుమతించకపోవడంపై అడుగగా, ఏదైనా ఉంటే ప్రెస్‌నోట్ రిలీజ్ చేస్తామంటూ దాటవేశారు.

ప్రభుత్వ అధికారి సంతకాల ఫోర్జరీ

- 17 మంది నిందితులపై కేసు.. 8 మంది అరెస్ట్
- పరారీలో మరో 9 మంది
- వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: ఫోర్జరీ సంతకాలు, నకిలీ ష్యూరిటీల తయారీ కేసులో 17 మందిపై కేసు నమోదు చేసి, 8 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. మరో 9 మంది పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో శనివారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ అధికారి అయిన తలమడుగు మండలం కొత్తూర్ పంచాయతీ కార్యదర్శి గీరవేణి రాహుల్ సంతకాలను కొందరు ఫోర్జరీ చేసి, నకిలీ ష్యూరిటీల కోసం డాక్యుమెంట్లు సృష్టించారు. ఆ పత్రాలు నిజమైనవని కోర్టులో సమర్పించి లబ్ధి పొందారు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు 17మందిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కొత్తూర్ గ్రామానికి చెందిన అభిలాష్ రెడ్డి కారోబార్‌గా పనిచేస్తున్నాడు. సయ్యద్ ఇర్ఫాన్ బ్రోకర్‌తో కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాలు ఫోర్జరీ చేశారు. గృహ విలువ పత్రాలు, పన్ను నకిలీ రసీదులను ఫోర్జరీ సంతకాలతో సృష్టించి కోర్టులో నేరస్తుల బెయిల్ వచ్చేందుకు అందించేవారు. కోర్టు జప్తుచేసిన ప్రాపర్టీలను రిలీజ్ చేసేందుకు నకిలీపత్రాలు సమర్పించేవారు. నకిలీ ష్యూరిటీలు ఉపయోగించి కోర్టు ద్వారా కొందరు నిందితులకు బెయిల్ ఇప్పించారని, వాహనాలు, సెల్‌ఫోన్లను రిలీజ్ చేసుకున్నారు. నకిలీ పత్రాలు తయారుచేసే వారు, కోర్టును తప్పుదోవ పట్టించేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ ఘటనలో నకిలీ ష్యూరిటీల ద్వారా లబ్ధి పొందిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, టూటౌన్ సీఐ కె.నాగరాజు పాల్గొన్నారు.

నిందితులు వీరే..

నిందితుల్లో తలమడుగు మండలం కొత్తూర్ గ్రామానికి చెందిన కారోబార్ కాటిపెల్లి అభిలాష్‌రెడ్డితోపాటు గంటి సత్తన్న, మద్దెల అశోక్, రామిరెడ్డి, కొకటాయి అశోక్, ఆదిలాబాద్‌లోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్, క్రాంతినగర్‌కు చెందిన షాహిద్, శాంతినగర్‌కు చెందిన ఎండీ.అమీర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. కాగా పరారీలో కొత్తూర్‌కు చెందిన గడుగు సురేష్, ఉల్లెంగుల భూమన్న, బోర్కర్ రాజు, బొర్కర్ శ్రీనివాస్, ఆదిలాబాద్‌లోని మహలక్ష్మివాడకు చెందిన సద్దాం, ఖుర్షీద్‌నగర్‌కు చెందిన ముషీర్, క్రాంతినగర్‌కు చెందిన షాహిల్, వడ్డెరకాలనీకి చెందిన ఖలీమ్, రణదీవేనగర్‌కు చెందిన జాంటీ పరారీలో ఉన్నారన్నారు.

దాడికి నిరసనగా విధుల బహిష్కరణ

బోథ్: బోథ్ సీహెచ్‌సీలో శుక్రవారం రాత్రి వైద్యుడు, సిబ్బందిపై యువకుడు దురుసుగా ప్రవర్తించి దాడికి యత్నించాడు. శనివారం వైద్యులు, సిబ్బంది విధులు బహిష్కరించారు. దీంతో ఓపీ సేవలు నిలిచిపోయాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కనుగుట్టకు చెందిన రమ్య గుర్తు తెలియని మందు తాగడంతో కుటుంబీకులు బోథ్ సీహెచ్‌సీకి శుక్రవారం రాత్రి 12 గంటలకు తీసుకువచ్చారు. విధుల్లో ఉన్న వైద్యుడు మిథిలేష్ చికిత్స చేస్తున్నాడు. ఆమె వాంతులు చేసుకోవడంతో మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు రిఫర్ చేయగా అంబులెన్స్‌లో ఎక్కించారు. అయితే సీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందడం లేదంటూ ఆగ్రహంతో భర్త రాము వైద్యుడు మిథిలేష్, సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించాడు. అతన్ని వీడియో తీస్తున్న సిబ్బందిపై దాడికి యత్నించారు. సిబ్బంది రమణ, స్వీపర్ కవితకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా దాడికి నిరసనగా వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించారు. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై శ్రీసాయిలు ఆసుపత్రికి చేరుకుని వారితో మాట్లాడారు. ఆసుపత్రిలో పోలీసు విభాగాన్ని ఏర్పాటు చేస్తామని సీఐ తెలిపారు. దీంతో వైద్యులు నిరసనను ఆపివేసి, రోగులకు చికిత్స అందించారు. దాడి చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మృతదేహం కోసం కుటుంబీకులు ఛత్తీస్‌గఢ్‌కు

బెల్లంపల్లి: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని గరియాబండ్ అటవీ ప్రాంతంలో ఈనెల 11న జరిగిన పోలీసు ఎన్‌కౌంటర్‌లో హతమైన బెల్లంపల్లి మండలం చంద్రవెల్లికి చెందిన మావోయిస్టు ఒడిశా రాష్ట్ర టెక్నికల్ టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాయకుడు జాడి వెంకటి అలియాస్ బిమల్ మృతదేహాన్ని తీసుకురావడానికి శనివారం బంధువులు వెంకటస్వామి, జనార్దన్, గ్రామస్తుడు దామోదర్‌గౌడ్ ఛత్తీస్‌గఢ్‌కు బయల్దేరి వెళ్లారు. అంబులెన్స్‌తో బయల్దేరగా మధ్యాహ్నం 12 గంటలకు గరియాబండ్ ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. మృతుల్లో వెంకటిని గుర్తించి కన్నీటి పర్యంతమయ్యారు. అక్కడి జిల్లా ఎస్పీని కలిసి వెంకటి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్తామని చెప్పారు. ఎస్పీ పర్యవేక్షణలో పోస్టుమార్టం ప్రారంభించారు. మృతుడి శరీరంలో 9 బుల్లెట్లు ఉన్నట్లు ప్రాథమికంగా వైద్యులు గుర్తించినట్లు సమాచారం. అయితే వీటిని వెలికితీసి ఇంకేమైన ఉన్నాయా అనే అనుమానంతో పలుమార్లు మృతదేహాన్ని స్కానింగ్ తీసి ఏమి లేవని నిర్ధారించుకున్నట్లు బంధువులు తెలిపారు. రాత్రి 8 గంటలకు మృతదేహాన్ని అప్పగించడంతో వారు తిరుగుపయనమయ్యారు. ఆదివారం మధ్యాహ్నం చంద్రవెల్లికి చేరుకునే అవకాశం ఉంది. కాగా, అంత్యక్రియల నిర్వహణ కోసం గ్రామంలో తగిన ఏర్పాట్లు చేశారు. అమరవీరుల బంధుమిత్రుల కమిటీ సభ్యులు, మాజీలు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



రాజయ్య (ఫైల్)

నస్పూర్: నస్పూర్ సీతారాంపల్లి రోడ్ శ్రీ రాజరాజేశ్వరటౌన్‌షిప్‌నకు చెందిన తోట రాజయ్య(56) సింగరేణి రిటైర్డ్ కార్మికుడి మృతదేహం గోదావరి నదిలో లభ్యమైనట్లు ఎస్సై జితేందర్‌సింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తోట రాజయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 11న ఫిజియోథెరపీకి వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం వరకు రాలేదు. అతని అదృశ్యంపై కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్ గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందన్న సమాచారాన్ని కుటుంబ సభ్యులకు చేరవేశాం. మృతదేహం రాజయ్యదిగా నిర్ధారించారు. మృతుడి కుమారుడు రంజిత్ ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

రిమ్స్‌లో లిఫ్ట్‌లో ఇరుక్కున్న రోగులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో లిఫ్ట్ శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆగిపోయింది. ఆ సమయంలో లిఫ్ట్‌లో ఉన్న ఓ వృద్ధురాలితోపాటు ఇద్దరు భయాందోళనకు గురై కేకలు వేశారు. గమనించిన రోగుల సహాయకులు సెక్యూరిటీ సిబ్బందికి సమాచారమిచ్చారు. రిమ్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు.

23న కొలాం సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని రజక సంఘ భవనంలో ఈనెల 23న కొలాం సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావ్ తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ భవనంలో శనివారం ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎన్నికలు ఉంటుందని పేర్కొన్నారు. కమిటీ నాయకులు, కార్యకర్తలు, మహిళ కమిటీ సభ్యులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో కుమ్రం సూరు యువ సేన జిల్లా అధ్యక్షుడు కుమ్ర రాజు, మహిళ సంఘం జిల్లా అధ్యక్షులు కుమ్ర లక్ష్మీబాయి. డివిజన్ అధ్యక్షుడు టేకం గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

15న ఉమ్మడి జిల్లా జోనల్‌స్థాయి వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల పాఠశాలలో ఈనెల 15న ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఉంటాయని కళాశాల క్రీడల జిల్లా కార్యదర్శి బాబురావు, డీఐఈవో అంజయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 19 ఏళ్లలోపు వయస్సు ఉండాలని, 2007 జనవరి 1 తర్వాత జన్మించి ప్రస్తుతం ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, హాజరయ్యేవారు బోనాఫైడ్ సర్టిఫికెట్‌తోపాటు ఆధార్‌కార్డును వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు 97045 83763 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నవరాత్రి ఉత్సవాలకు రావాలని ఆహ్వానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి, ఆలయ అధికారులు

బాసర: బాసరలో రాబోయే నవరాత్రి ఉత్సవాలకు రావాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను శనివారం హైదరాబాద్‌లో ఆలయ అధికారులు ఆహ్వానించారు. అనంతరం ఉత్సవాల పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి అంజన్నదేవి, ఏఈవో సుదర్శన్‌గౌడ్, ప్రధానార్చకులు సంజీవ్ పూజారి, వేద పండితుడు నవీన్ శర్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మామ్మాయి రమేశ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థితో పీడీ తిరుపతి

జన్నారం: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో శనివారం జరిగిన జోనల్ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో అండర్ -14, 50 మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో జన్నారం మండలం ఇందన్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఓ.రేవంత్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని హెచ్‌ఎం బి.రాజేందర్, ఫిజికల్ డైరెక్టర్ శివనూరి తిరుపతి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పాఠశాలకు వెళ్లాలని మందలించడంతో ఆత్మహత్య

- ఎలుకల నివారణ గుళికలు మింగిన కుమార్తె
- చికిత్స పొందుతూ మృతి
- బెల్లంపల్లి మండలం ఆకెనపల్లిలో ఘటన



సుప్రియ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: పాఠశాలకు వెళ్లి ఉన్నతంగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో కుమార్తె ఎలుకల నివారణ గుళిక మింగి ఆత్మహత్యకు పాల్పడింది. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లిలో ఈఘటన చోటుచేసుకుంది. స్థానికులు, తాళ్లగురిజాల ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా గోండ్‌పిప్రి తాలుకా బంగారంతలోది గ్రామానికి చెందిన ఎగ్గేవార్ రామాజీ (రమేశ్)– లక్ష్మి దంపతులు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం ఆకెనపల్లికి వచ్చి స్థిరపడ్డారు. ఈ దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండో కుమార్తె సుప్రియ (14) గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. అనారోగ్యంతో ఆమె నాలుగు రోజులుగా పాఠశాలకు వెళ్లలేదు. తల్లిదండ్రులు శుక్రవారం సుప్రియను ప్రతీరోజు పాఠశాలకు వెళ్లి బాగా చదువుకోవాలని మందలించారు. 'నాకు చదువు అంటే ఇష్టం లేదు..నేను పాఠశాలకు వెళ్లను 'అని తల్లిదండ్రులతో వారించి స్కూల్‌కు వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగివచ్చి కుటుంబీకులతో కలివిడిగా గడిపింది. అందరూ నిద్రిస్తుండగా శనివారం తెల్లవారుజామున బాత్రూంలో ఉన్న ఎలుకల నివారణకు ఉపయోగించే గుళికలను మింగింది. వాంతులు చేసుకోవడంతో తండ్రికి చెప్పింది. 'సారీ డాడీ, సారీ మమ్మీ నాకు చదువుకోవాలని లేదు.. నేను బతుకలేను' అంటూ తల్లిదండ్రులతో బోరున విలపిస్తూనే అస్వస్థతకు గురైంది. వెంటనే ఆమెను బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి పంపించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించి తమను ఆదుకుంటావని అనుకుంటే అంతలోనే మమ్మల్ని విడిచి వెళ్లావా బిడ్డా అంటూ ఆ తల్లిదండ్రులు రోదించిన తీరు అందరిని కలిచివేసింది. తోటి విద్యార్థులు, స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మీ ఎంపికలో విఫలమవుతానని యువకుడు..



అరవింద్ (ఫైల్)

జైపూర్: ఆర్మీ ఎంపిక కోసం శిక్షణలో రన్నింగ్, లాంగ్‌జంప్‌లో సక్సెస్ కాలేకపోతున్న యువకుడు ఎక్కడ విఫలమవుతానేనని భయంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని వేలాల గ్రామానికి చెందిన గోదారి చిన్నమల్లక్క–రాయమల్లు దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక్క కుమార్తె ఉన్నారు. ఇందులో చిన్నకుమారుడు అరవింద్ (19) ఇంటర్ పూర్తి చేసి ఆర్మీ ఎంపిక కోసం కరీంనగర్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. ఆర్మీ పరీక్షలు రాసిన ఈవెంట్స్‌లో ప్రయత్నిస్తుండగా కాలు బెనికి రన్నింగ్ చేయలేకపోయాడు. శుక్రవారం అరవింద్ స్వగ్రామానికి వచ్చాడు. తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా మనస్తాపంతో అరవింద్.. గట్టుమల్లన్న గుట్టవైపు వెళ్లి కచ్చిరుబండ వద్ద గడ్డి మందు తాగాడు. తిరిగి గుట్టు కమాన్ రోడ్డులో ఉన్న వారి పొలం వద్దకు వచ్చి నాన్నకు ఫోన్ చేశాడు. గడ్డి మందు తాగిన దాహం వేస్తుందని చెప్పగా ఆయన అక్కడికి చేరుకుని అరవింద్‌ను మంచిర్యాలకు తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి పంపించారు. శనివారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) గ్రామానికి చెందిన పేర్క అరుణ్ (33) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అరుణ్ మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో తల్లితోపాటు భార్యతో తరచూ గొడవపడేవాడు. మనస్తాపం చెందిన ఆయన శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..



సాగర్ (ఫైల్)

భీమిని: మద్యానికి బానిసై యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని రాంపూర్‌కు చెందిన ఏగోళం సాగర్‌గౌడ్ (25) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తనకు పెళ్లి చేయమని తల్లితో తరచూ గొడవపడేవాడు. తాగుడు మానేస్తే పెళ్లి చేస్తానని తల్లి చెబుతుండేది. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం సాగర్‌గౌడ్ పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి, బంధువులు ప్రైవేటు వాహనంలో అతన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంలో చేర్పించగా చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి చిన్నతనంలో చనిపోయాడు. తల్లి భాగ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.